ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 1, ఆగస్ట్ 2026

జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్

ఆసిఫాబాద్, జులై 31, ప్రభాతవార్త :

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల దృష్ట్యా, ప్రశాంత వాతావరణ పరిస్థితులను మరింత సవ్యంగా కొనసాగించడానికి జులై 31నుండి ఆగష్టు 31వరకు జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ నితికా పంత్ శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు. 30 పోలీస్ యాక్ట్1861 అమల్లో ఉన్నందున జిల్లాలో డిఎస్పి, ఎఎస్పీ, ఆపై పోలీస్ ఉన్నతాధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, బహిరంగ సభలు, తదితర ప్రజలు గుమికూడి ఉండేవిధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు.చట్టపరమైన జారీచేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం శిక్షార్హులు అవుతారని సూచించారు. నిషేధంలో ఉన్న నిబంధనలను తప్పనిసరిగా అందరూ పాటించాలన్నారు. ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తుగా దరఖాస్తు చేసుకొని అనుమతులు తీసుకోవాలని సూచించారు. 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున ఎటువంటి అనుమతులు లేని ర్యాలీలు నిర్వహించిన వారిపై కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రాణహిత నది పరివాహక ప్రజలు
అప్రమత్తంగా ఉండాలి

● పంటల ఎంపికలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి: జిల్లా కలెక్టర్ కె. హరిత

కౌటాల, జూలై 31, ప్రభాతవార్త

జిల్లాలో కురుస్తున్న వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె. హరిత సూచించారు. శుక్రవారం కౌటాల మండలం తుమ్మిడి హెట్టి వద్ద ప్రాణహిత నది వరద పరిస్థితిని ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించిన కలెక్టర్ నదిలో నీటి మట్టం, వరద ప్రవాహం, భద్రతా చర్యలు, భవిష్యత్ పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాణహిత నదిలో నీటి మట్టం 146.65 మీటర్ల ఎత్తులో కొనసాగుతోందని, దిగువకు 7.75 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వెళ్తోందని తెలిపారు. ఎగువ ప్రాంతాల నుంచి సుమారు 12 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు తదితర శాఖల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని చెప్పారు.జిల్లాలో ప్రస్తుతం ఎలాంటి ఆందోళనకర పరిస్థితులు లేవని, వరద ప్రవాహం మరింత పెరిగినప్పటికీ గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం లేదని స్పష్టం చేశారు. అయినప్పటికీ అధికారులు ఎలాంటి నిరక్ష్యాన్నికి తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు వరద **మిగతా 2లో..**

భారీ వర్షాల నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టాలి

పంట మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించండి : రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి

నిర్మల్, జులై 31, ప్రభాతవార్త:

ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షాలు తగ్గే అవకాశం ఉన్నందున రైతులు పంటల సాగులో సమతుల్యత పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు. నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టుల నీటి నిల్వలు, దెబ్బతిన్న రహదారులు, వంతెనల పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాలకు దెబ్బతిన్న రహదారులు, వంతెనలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్పష్టం చేశారు. తాగునీటి సమస్య రాకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలన్నారు. వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పంట మార్పిడిపై విస్తృత అవగాహన కల్పించాలని, వరికి బదులు ఆయిల్ పామ్, కంది, నువ్వులు, పత్తి పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. విత్తనాల సరఫరాకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ.. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలతో జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులు నిండాయని తెలిపారు. దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. జిల్లాలో వర్షపాత లోటు తగ్గిందని, 17 మండలాలు సాధారణ స్థాయికి చేరుకున్నాయని వివరించారు. జిల్లాలో 5,93,670 ఎకరాల్లో పంటలు సాగయ్యాయని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, ఎస్. రాజేశ్వర్, కిషోర్ కుమార్, డీఆర్ఓ రాథోడ్ రమేష్, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

ఆసిఫాబాద్, జూలై 31,ప్రభాతవార్త :

రహదారి ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ నితికా పంత్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, కాగజ్ నగర్ రాజస్వ మండల అధికారి కృష్ణయ లతో కలిసి రహదారి భద్రత కమిటీ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి సంస్థ అధికారులు సర్వీస్ రహదారులపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, రాంగ్ రూట్, యు టర్న్‌ల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించడం జరిగిందని, ఆయా ప్రాంతాలలో ప్రమాదాల నివారణకు రక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ / సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, జిల్లా కార్యాలయానికి వచ్చే ఉద్యోగులు కూడా తప్పని సరిగ్గా హెల్మెట్ ధరించాలని అన్నారు మద్యం సేవించి వాహనం నడిపే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేయాలని తెలిపారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రహదారికి ఇరువైపుల రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్, రహదారులు శాఖ అధికారులు రహదారికి ఇరువైపులా చెట్ల పొదలు, మూల మలుపుల వద్ద పొదలను తొలగించాలని, రహదారిపై గుంతలు, సైడ్ డ్రైనేజిలకు మరమ్మత్తులు చేపట్టాలని తెలిపారు. రవాణా శాఖ అధికారులు జిల్లా సరిహద్దులో సి సి కెమెరాలు ఏర్పాటు **మిగతా 2లో..**

ప్రాణహిత నది పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రభావిత ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నది ఒడ్డు, చెక్‌డ్యాంలు, వాగులు, వంతెనల వద్దకు సరదాగా వెళ్లడం, సెల్ఫీలు దిగడం, ఈత కొట్టేందుకు ప్రయత్నించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రైతులు అప్రమత్తంగా ఉండాలిపంట సాగులో నాట్ల పరిస్థితిని రైతులు, వ్యవసాయ కూలీలను అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో రైతులు, వ్యవసాయ కూలీలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మెరుపులు, ఉరుములు, వరద ప్రవాహాల సమయంలో పొలాల్లో పని చేసే వేళ తగిన జాగ్రత్తలు పాటించాలని, ప్రమాదకర పరిస్థితులు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు.వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని పంటల ఎంపికలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధిక నీటి అవసరం ఉన్న వరి పంటకు బదులుగా తక్కువ నీటి అవసరమయ్యే పత్తి, పప్పుధాన్యాలు, కూరగాయలు, ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని తెలిపారు. జిల్లాలో కొందరు రైతులు వరితో పాటు పత్తి, మిరప తదితర పంటలను సాగు చేస్తూ అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగిస్తున్నారని, పంటల మార్పిడి ద్వారా అధిక ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.పంటల వైవిధ్యీకరణ, ప్రత్యామ్నాయ పంటల సాగు, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కార చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్.పి. వినయ్ బాబు, డివ్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరమణ, అసిస్టెంట్ ఇంజనీర్ రాజ్‌కుమార్, తుమ్మిడి హెట్టి సర్పంచ్ సూరజ్, సంతోష్, ఇరిగేషన్ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

చేయాలనీ తెలిపారు. పాఠశాలల బస్సు లను నిరంతరంగా తనిఖీలు చేపట్టాలని, ప్రమాదాలు జరిగితే వెంటనే తరలించే విధంగా అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించాలి

సమాజాన్ని నాశనం చేస్తున్న మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా మాదకద్రవ్యాల నియంత్రణ మరియు నిర్మూలన కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు బానిస కాకుండా అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా చెప్పట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై పోలీసు, ఎక్సైజ్, విద్య, వైద్య, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేసి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యాసంస్థల్లో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కలెక్టర్ తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా మార్చాలని అధికారులను ఆదేశించారు. విద్యా సంస్థల 400 మీటర్ల పరిధిలో గుట్కా, సిగరెట్ అమ్మకాలను నిషేధించాలని అన్నారు. విద్యా సంస్థల్లో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు పహీదుద్దీన్, అశోక్, డిపిఓ భిక్షపతి గౌడ్, జిల్లా వైద్య అధికారి సితారమ్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి అశోక్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జైలులో భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సమీక్ష

- ఖైదీల సంక్షేమం, పెరోల్ ప్రక్రియపై అధికారులకు కీలక ఆదేశాలు - సత్ప్రవర్తనతో మెలగాలని ఖైదీలకు సూచన

ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో, జూలై 31, ప్రభాతవార్త:

సెక్యూరిటీ రివ్యూ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ జిల్లా జైలును సందర్శించి భద్రతా ఏర్పాట్లు, ఖైదీల సంక్షేమం, పెరోల్ ప్రక్రియ, జైలు పరిపాలనపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.జిల్లా జైలుకు చేరుకున్న ఎస్పీకి జైలు సిబ్బంది గౌరవ వందనం సమర్పించగా, జైలు ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి. గోపిరెడ్డి పూలమొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం జైలు ఆవరణను పరిశీలించిన ఎస్పీ ఖైదీల బ్యారక్‌లు, జైలు ఆసుపత్రి, వంటశాల, పరిపాలనా విభాగాలు, ఇతర గదులను తనిఖీ చేసి అక్కడి నిర్వహణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.జైలు ప్రహరీ గోడ, భద్రతా గోడలు, ప్రధాన ప్రవేశ ద్వారం, వాచ్ టవర్లు, భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, జైలు భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఖైదీలకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు నాణ్యతతో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.తదనంతరం జైలు అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జైలు భద్రత, ఖైదీల నిర్వహణ, సంక్షేమ కార్యక్రమాలు, భోజన నాణ్యత, వైద్య సేవలు, పునరావాస కార్యక్రమాలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. అలాగే పెరోల్ మంజూరు ప్రక్రియ, అర్హులైన ఖైదీల దరఖాస్తుల పరిశీలన, నిబంధనల అమలు, పెరోల్‌పై విడుదలయ్యే ఖైదీల పర్యవేక్షణపై సమీక్ష నిర్వహించి, నిబంధనలకు అనుగుణంగా అర్హులైన ఖైదీల దరఖాస్తులను సకాలంలో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, జైలు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఖైదీల సంస్కరణ, పునరావాస కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఖైదీలు సత్ప్రవర్తనతో మెలిగి సమాజంలో తిరిగి బాధ్యతాయుతమైన పౌరులుగా స్థిరపడేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ఎల్. జీవన్ రెడ్డి, వెంకట నరసయ్య, జైలు ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి. గోపిరెడ్డి, జైలర్ ఎన్. చంద్రశేఖర్, సీఐ కె. నాగరాజు, ఆర్ఐ డి. వెంకటి, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రాణహిత-పెన్‌గంగా బ్రిడ్జ్‌ను పరిశీలించిన కలెక్టర్

- ఓవర్‌లోడ్ వాహనాల నియంత్రణకు చర్యలు

- నదీ తీరంలో భద్రత పెంచాలని ఆదేశం

సిర్పూర్ (టి), జూలై 31, ప్రభాతవార్త :

సిర్పూర్ మండలం వెంకట్రావుపేట వద్ద ప్రాణహిత-పెన్‌గంగా బ్రిడ్జ్‌ను జిల్లా కలెక్టర్ కే. హరిత శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్షాల నేపథ్యంలో పెన్‌గంగా నదిలో నీటి ప్రవాహ పరిస్థితి, బ్రిడ్జ్‌పై వాహనాల రాకపోకలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా స్థానిక గ్రామస్తులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. బ్రిడ్జ్ మార్గంలో ఓ లారీ దిగబడిపోయిన విషయంతో పాటు, ఓవర్‌లోడ్ వాహనాల రాకపోకల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఓవర్‌లోడ్ వాహనాలను నియంత్రించేందుకు వెంకట్రావుపేట వద్ద ఏర్పాటు చేసిన ఆర్చ్‌ను తొలగించిన విషయంపై కలెక్టర్ ఆరా తీశారు. ఆర్చ్‌ను ఎవరు తొలగించారో తమకు తెలియదని గ్రామస్తులు తెలిపారు.అనంతరం పెన్‌గంగా నీటి ప్రవాహాన్ని కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. వర్షాల కారణంగా నదిలో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నదీ తీరంలో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి, ప్రజలు నది ప్రవాహం వైపు వెళ్లకుండా పటిష్ఠమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. బ్రిడ్జ్‌పై వాహనాల రాకపోకలపై నిరంతరం నిఘా ఉంచి, ఓవర్‌లోడ్ వాహనాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి సందీప్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

బహిరంగ మద్యం సేవనంపై నిషేధం కొనసాగింపు

- అనుమతి లేని డ్రోన్లు, భారీ శబ్దంతో డీజేలకు చెక్ - సభలు, ర్యాలీలకు ముందస్తు పోలీసు అనుమతి తప్పనిసరి

- సిపి అంబర్ కిషోర్ ఝా

మంచిర్యాల, జూలై 31, ప్రభాతవార్త

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత దృష్ట్యా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవనంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను మరో నెల పాటు కొనసాగిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు ఆగస్టు ఒకటి నుంచి సెప్టెంబర్ ఒకటి వరకు అమల్లో ఉంటాయని వెల్లడించారు.అదేవిధంగా అనుమతి లేకుండా డ్రోన్ల వినియోగం, అధిక శబ్దంతో డీజే సౌండ్ వ్యవస్థల వినియోగంపై కూడా నిషేధం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమాలకు మైక్ సెట్ వినియోగించాలంటే సంబంధిత సహాయ పోలీస్ కమిషనర్ నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.ఈ కాలంలో ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించాలంటే ముందస్తు పోలీసు అనుమతి తప్పనిసరిగా పొందాలని స్పష్టం చేశారు. నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై భారతీయ న్యాయ సంహిత, హైదరాబాద్ నగర పోలీస్ చట్టం నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బెల్లంపల్లి నియోజకవర్గం, గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత

- ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి

బెల్లంపల్లి, జూలై 31, ప్రభాతవార్త

బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి పేర్కొన్నారు. కాసిపేట మండలం పల్లంగూడ గ్రామపంచాయతీలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడంలో ఈ భవనం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. గ్రామాల అభివృద్ధి, రోడ్లు, భవనాలు, మౌలిక వసతుల పెంపుదల ద్వారా ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను దశలవారీగా చేపట్టి, ప్రజలకు అవసరమైన సదుపాయాలను అందిస్తామని ఆయన తెలిపారు. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని హామీ ఇస్తూ, గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రత్నం సుకుమారి, కాసిపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పన్నల మహేష్, పల్లంగూడ గ్రామ సర్పంచ్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, ఇతర నాయకులు

ఎస్ఐఆర్ ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే

భైంసా, జులై 31, ప్రభాతవార్త:

భైంసా పట్టణంలోని ఎస్ఎస్ ఫ్యాక్టరీలో నిర్వహించిన ఎస్ఐఆర్ ప్రవాస్ అభియాన్ కార్యక్రమానికి ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రవాసి కార్యకర్తగా బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యదర్శి పైడిపెల్లి గంగాధర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు రావుల రాము పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా నగర కార్యవర్గ సమావేశం, శక్తి కేంద్ర ప్రభారీలు, పదాధికారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ కార్యక్రమం అమలు, పార్టీ సంస్థాగత బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై నాయకులకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే రామారావు పటేల్ దిశానిర్దేశం చేశారు.

ఉపాధ్యాయుడు యెలుగు రాజేశ్వర్‌కు సన్మానం

సారంగాపూర్, జులై 31, ప్రభాతవార్త:

మండలంలోని కొట్ల(బి) గ్రామ పాఠశాల ఉపాధ్యాయుడిగా సేవలు అందించి శుక్రవారం పదవీ విరమణ పొందిన యెలుగు రాజేశ్వర్‌ను గ్రామ సర్పంచ్ బల్గారి అజయ్, ఉప సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, గ్రామ నాయకులు, ఉపాధ్యాయులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులకు చక్కటి విద్యతో పాటు మంచి క్రమశిక్షణను నేర్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయుడి సేవలకు గ్రామ ప్రజలు, విద్యార్థులు ఎల్లప్పుడూ రుణపడి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఐదవ తరగతి విద్యార్థిని ఫిర్యాదుతో స్పందించిన మున్సిపల్ చైర్మన్

భైంసా, జులై 31, ప్రభాతవార్త:

భైంసా పట్టణంలోని న్యూ సంతోష్ మాత కాలనీలో రహదారులు, వీధి దీపాల సమస్యలపై ఐదవ తరగతి విద్యార్థిని శ్రీదేవిక ఇటీవల సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మెల్ల దత్తాత్రి కాలనీని సందర్శించి స్థానిక ప్రజలతో మాట్లాడారు. కాలనీలోని రహదారులు, వీధి దీపాల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించిన ఆయన స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే కాలనీలో గ్రావెల్ రోడ్డు పనులు చేపట్టడంతో పాటు వీధి దీపాల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లిన విద్యార్థిని శ్రీదేవికను స్థానికులు అభినందించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు మున్సిపాలిటీ కృషి చేస్తుందని మున్సిపల్ చైర్మన్ తెలిపారు. అనంతరం కాలనీవాసులు చైర్మన్‌ను శాలువాతో సత్కరించారు.

సమస్యలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ తుమ్మెల్ల దత్తాత్రి, స్థానికులు

డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, జులై 31, ప్రభాతవార్త

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా చేపట్టిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు లతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ, ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ నిర్ణీత గడువు కంటే ముందుగానే పూర్తి చేసే విధంగా అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. జిల్లాలో అనామోలీస్ ఎక్కువగా ఉన్నాయని, ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి అయిన తర్వాత సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. నోటీసుల విషయంలో ఓటర్లు కంగారు పడవలసిన అవసరం లేదని, నోటీసులో పేర్కొన్న ధ్రువపత్రాలను సమర్పించడం ద్వారా ఓటు హక్కును పొందవచ్చని తెలిపారు. డబుల్, డెత్, షిఫ్ట్ అయిన వారి ఓట్లను నిబంధనల ప్రకారం తొలగించడం జరుగుతుందని, ఇంకా ఎన్యుమరేషన్ ఫారాలు అందించని వారిని గుర్తించి బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా ఫారాలను బూత్ స్థాయి అధికారులకు సమర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. డిజిటలైజేషన్ పూర్తయిన తర్వాత పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేయడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా ఒక పోలింగ్ కేంద్రంలో 1 వేయి 200 ఓటర్లకు మించకుండా ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఒక కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోతిరాం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, ఎన్నికల విభాగం అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సి.ఎం.ఆర్. వెంటనే పూర్తి చేయాలి

- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు

హాజీపూర్, జులై 31, ప్రభాతవార్త

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కస్టమ్ మిల్లింగ్ రైస్ సరఫరాను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు అన్నారు. శుక్రవారం జిల్లాలోని హాజీపూర్ మండలంలోని ఎస్ఆర్ఎం రైస్ మిల్ ను మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసి మిల్లులో పెండింగ్‌లో ఉన్న సిఎంఆర్ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ సీఎంఆర్‌ను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని రైస్ మిల్ యాజమాన్యాన్ని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా సిఎంఆర్ సరఫరా పూర్తి చేయడం ప్రతి మిల్లర్ బాధ్యత అని, ఈ విషయంలో నిరక్ష్యానికి తావు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రైస్ మిల్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ సహచరుడికి కన్నీటి వీడ్కోలు

బెల్లంపల్లి, జులై 31, ప్రభాతవార్త

ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యమ సహచరుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వారి పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి సేవలను స్మరించుకుంటూ, వారి మరణం ఉద్యమానికి తీరని లోటని రేణికుంట్ల ప్రవీణ్ పేర్కొన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఉద్యమంలో ఆయన చేసిన సేవలు, ప్రజల పట్ల చూపిన అంకితభావం ఎప్పటికీ గుర్తుండిపోతాయని తెలిపారు.

ఉధమ్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

మందమర్రి, జులై 31, ప్రభాతవార్త

భారత స్వాతంత్ర్య సమరయోధుడు ఉధమ్ సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని మందమర్రి పట్టణానికి చెందిన మాజీ ఆర్మీ జవాన్, ప్రస్తుత ఎస్‌అండ్‌పీసీ ఉద్యోగి రాజేష్ పివ్ హాల్, రాణి పివ్ హాల్ దంపతులు శుక్రవారం తమ నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జలియన్‌వాలా బాగ్ మారణకాండకు ప్రతీకారంగా బ్రిటిష్ అధికారి మైఖేల్ ఓ డయ్యర్‌ను హతమార్చి ఉధమ్ సింగ్ అమరుడయ్యారని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, దేశభక్తి భావాలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.డి. రఫీ, సంఖ్యా శంకర్, జార్జ్ అశోక్, పురుషోత్తం సదానందం, కే. ఆనంద్, కే. రియాస్నిక తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు రాజ్యాంగ హక్కు.. తగ్గిస్తే బహుజన మహిళల భవిష్యత్తు అంధకారం

- బీసీ మహిళల హక్కుల కోసం న్యాయపోరాటానికైనా సిద్ధం: న్యాయవాది పేరం అలేఖ్య

మంచిర్యాల,జులై 31, ప్రభాతవార్త

రిజర్వేషన్లు దయాదాక్షిణ్యాలు కాదని, రాజ్యాంగం కల్పించిన హక్కులని తెలంగాణ రాష్ట్ర ఉద్యమ పోరాట సంఘం బీసీ మహిళా కన్వీనర్, న్యాయవాది పేరం అలేఖ్య పేర్కొన్నారు. కొందరు రిజర్వేషన్లను రద్దు చేయాలని చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఆమె అన్నారు.భారత రాజ్యాంగంలోని సంబంధిత నిబంధనల ప్రకారం వెనుకబడిన వర్గాలు, మహిళల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం రాష్ట్ర బాధ్యత అని ఆమె తెలిపారు. రిజర్వేషన్ల వల్లే బీసీ మహిళలు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థలు, రాజకీయ రంగాల్లో ప్రాతినిధ్యం పొందుతున్నారని పేర్కొన్నారు. రిజర్వేషన్లు లేకుంటే బీసీ మహిళలు మళ్లీ సామాజిక, ఆర్థిక, రాజకీయంగా వెనుకబడే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ మహిళా రిజర్వేషన్లను ఏ పరిస్థితుల్లోనూ తగ్గించరాదని, అవసరమైతే వాటిని యాభై శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. బీసీ మహిళల రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయించి ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసి పోరాటం కొనసాగిస్తామని పేరం అలేఖ్య స్పష్టం చేశారు.

హాజరైన అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద

ప్రతి పాఠశాల నుంచి వినూత్న ఆవిష్కరణలు రావాలి

- శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా సంస్కృతికి ఉపాధ్యాయులే మార్గదర్శకులు - జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద

కాగజ్‌నగర్ రూరల్,జూలై 31, ప్రభాతవార్త

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, ఆవిష్కరణాత్మక ఆలోచనలను పెంపొందించి జాతీయ స్థాయిలో రాణించేలా ప్రతి పాఠశాల కార్యాచరణ రూపొందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద అన్నారు. కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రేరణ-మానక్ 2026-27 అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం, సృజనాత్మకత, పర్యావరణ బాధ్యతలను పెంపొందించడంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపడుతున్న విజ్ఞాన, పర్యావరణ కార్యక్రమాలను జిల్లాలో విజయవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి పాఠశాల నుంచి విద్యార్థుల వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణలను వెలికితీసి ప్రోత్సహించాలని అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి మాట్లాడుతూ.. నేటి విద్యా విధానంలో పాఠ్యాంశాలతో పాటు పరిశోధనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలు, ఆవిష్కరణ సామర్థ్యాలను విద్యార్థుల్లో పెంపొందించడం అవసరమన్నారు. ప్రేరణ-మానక్ వంటి కార్యక్రమాలు గ్రామీణ విద్యార్థుల ప్రతిభను జాతీయ స్థాయికి తీసుకెళ్లే గొప్ప వేదికలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రశ్నించేలా, ఆలోచించేలా ప్రోత్సహించి మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ప్రేరణ-మానక్ 2026-27లో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థుల వినూత్న ఆవిష్కరణలను గుర్తించి ఆగస్టు 20లోగా జిల్లా వ్యాప్తంగా వంద శతం నామినేషన్లు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి పాఠశాల నుంచి ఆగస్టు 15లోపు ఐదు ఉత్తమ ఆవిష్కరణల వివరాలను జిల్లా సైన్స్ అధికారికి సమర్పించాలని, పరిశీలన అనంతరం సంబంధిత ఆన్‌లైన్ పోర్టల్‌లో గరిష్ఠంగా ఐదు ఆవిష్కరణలను నమోదు చేయాలని తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి విజ్ఞాన ప్రాజెక్టు32వ జాతీయ బాలల విజ్ఞాన సదస్సు-2026లో సుస్థిరత కోసం విజ్ఞానం-ఆవిష్కరణల్ము అనే అంశంపై ప్రతి పాఠశాల కనీసం ఒక ప్రాజెక్టుతో పాల్గొనాలని కోరారు. స్థానికంగా ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటికి శాస్త్రీయ పరిష్కారాలను కనుగొనేలా విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. అలాగే ఏక్ పెడ్ మా కే నామ్-విత్తనం నుంచి వృక్షం వరకు-2026 కార్యక్రమంలో భాగంగా ప్రతి విద్యార్థి తన తల్లి పేరుతో ఒక మొక్కను నాటి సంరక్షించాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో హరిత ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మొక్కల సంరక్షణ, విత్తన బంతుల తయారీ, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. పర్యావరణ ఆన్‌లైన్ పోటీల్లో ప్రతి ఉపాధ్యాయుడు, విద్యార్థి తప్పనిసరిగా పాల్గొనేలా చర్యలు తీసుకుని ధ్రువపత్రాలు పొందేలా చూడాలని అన్నారు. జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్ కార్యక్రమ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. జిల్లా బాలల విజ్ఞాన సదస్సు విద్యా సమన్వయకర్త మామిడాల తిరుపతయ్య, వనరుల వ్యక్తి దుర్గాప్రసాద్ ప్రేరణ-మానక్, జాతీయ బాలల విజ్ఞాన సదస్సు, పర్యావరణ కార్యక్రమాలు, నమోదు విధానం, కార్యాచరణ ప్రణాళికపై ప్రజెంటేషన్ ద్వారా ఉపాధ్యాయులకు సమగ్ర అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. లక్ష్మీనరసింహ, అధ్యాపకులు డా. దేవేందర్, డా. శారద, జిల్లా ప్రణాళిక సమన్వయకర్త అబ్దుల్ లతీఫ్, మండల విద్యాశాఖ అధికారి వాసాల ప్రభాకర్, జిల్లాలోని సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌ను విడుదల చేయాలి

ఆసిఫాబాద్, జులై 31, ప్రభాతవార్త :

ఫీజు రియంబర్స్మెంట్ స్కీమును యధాతధంగా అమలు చేయాలని, పెండింగ్ ఫీజులు 8 వేల కోట్లు వెంటనే చెల్లించాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిన్నచూపును ప్రశ్నిద్దామని, ఇంటర్/ఇంజనీరింగ్/ఫార్మసీ/పీజీ/డిగ్రీ తదితర కోర్సులు పూర్తయిన వారికి కాలేజీ యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. దీనితో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కోర్సులు పూర్తయిన వారికి ఐటి, ప్రైవేట్ కంపెనీలలో ఉద్యోగాలు వచ్చాయని, మరికొందరు విదేశాలలో ఉన్నత విద్యా చదువుతున్నారని కానీ సర్టిఫికెట్స్ లేక మానుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రోజుకొక జీవో జారీ చేసి విద్యార్థులలో గందరగోళం సృష్టిస్తున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆవిడపు ప్రణయ్

వరద పరిస్థితులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- తహసీల్దార్ రహీముద్దీన్

సిర్పూర్(టి), జూలై 31,ప్రభాతవార్త :

గత మూడు రోజులుగా జిల్లాలో నిరంతరాయంగా కురుస్తున్న వర్షాల కారణంగా ఏర్పడుతున్న వరద పరిస్థితులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిర్పూర్ టి తహసీల్దార్ రహీముద్దీన్ అన్నారు. శుక్రవారం రోజున వెంకట్రావు పేట లోని పెన్గంగా ఉప్పొంగుతొండడంతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటి రెండు రోజులు వర్ష సూచనలు ఉండడంతో వరద ప్రభావిత ప్రాంతాలు లోతట్టు ప్రాంతాలు ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అధికార యంత్రాంగం ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సహాయం చేసేందుకు సిద్ధంగా ఉంటుందని తెలిపారు. వరద పరిస్థితులపై ప్రజల సౌకర్యార్థం సిర్పూర్ టి మండలంలోని వెంకట్రావుపేట్ హుడికిలి డోర్ పెళ్లి పారిగాం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

సదరం శిబిరంలో వైద్య పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలి

ఆసిఫాబాద్, జూలై 31,ప్రభాతవార్త :

జిల్లా కేంద్రంలోని సాధారణ ఆసుపత్రిలో కొనసాగుతున్న సదరం శిబిరంలో వైద్య పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కొనసాగుతున్న సదరం శిబిరాన్ని ఆకస్మికంగా సందర్శించి లోకో మోటార్ (ఆర్థోపెడిక్) విభాగానికి సంబంధించిన వైకల్య నిర్ధారణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వైద్య పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలని, అర్హత కలిగిన దివ్యాంగులకుయుడిఐడి ధృవపత్రాలను త్వరితగతిన జారీ చేయాలని, దివ్యాంగుల ధ్రువపత్రాల జారీకి సంబంధించిన ప్రక్రియలో ఎలాంటి పనులు పెండింగ్‌లో లేకుండా సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. దివ్యాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు సులభంగా అందేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. శిబిరానికి హాజరైన లబ్ధిదారుల సంఖ్య, దివ్యాంగత్వాన్ని అంచనా వేసే విధానం, వివిధ రకాల వైకల్యాలకు అనుగుణంగా నిర్ధారించే వైకల్య శాతం తదితర వివరాలను ఆర్థోపెడిక్ అసెస్‌మెంట్ వైద్యుడిని అడిగి తెలుసుకున్నారు. శిబిరంలో వైకల్య నిర్ధారణ ప్రక్రియ, వివిధ రకాల వైద్య పరీక్షలను సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిడి రామకృష్ణ, ప్రభుత్వ ఆసుపత్రి ఉప పర్యవేక్షకులు డా. కృష్ణ, యుడిఐడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై పశువులు వదిలితే చర్యలు తప్పవు

- రాజంపేట గ్రామపంచాయతీ పాలకవర్గం హెచ్చరిక

ఆసిఫాబాద్ టౌన్, జులై 31, ప్రభాతవార్త :

రాజంపేట ప్రధాన రహదారులు, అంతర్గత వీధులు, మార్కెట్ ప్రాంతాల్లో పశువులను విచ్చలవిడిగా రోడ్లపై వదిలేయడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిస్థితిని అత్యంత తీవ్రంగా పరిగణించిన రాజంపేట గ్రామపంచాయతీ పాలకవర్గం, రోడ్లపై పశువులు సంచరించకుండా శుక్రవారం ప్రత్యేక తీర్మానం చేసింది. ఇటీవలి కాలంలో రాత్రి వేళల్లో రోడ్లపై తిరుగుతున్న పశువుల వెంట వీధి కుక్కలు గుంపులుగా వెంటపడుతూ దాడి చేస్తున్న ఘటనలు గ్రామపంచాయతీ దృష్టికి వచ్చాయని, ముఖ్యంగా దూడలు, చిన్న పశువులు వీధి కుక్కల బారిన పడి గాయపడుతున్నాయని, ఈ పరిస్థితి పశువుల ప్రాణాలతో పాటు వాహనదారులు, ప్రజల భద్రతకు కూడా తీవ్రమైన ముప్పుగా మారిందని పాలకవర్గం పేర్కొంది. ఆగస్టు 8 నుండి రోడ్లపై సంచరిస్తున్న పశువులు కనిపిస్తే వాటి యజమానులపై తెలంగాణ 2018 పంచాయతీరాజ్ గ్రామపంచాయతీ చట్టం ప్రకారం జరిమానాలు విధించడం, అవసరమైతే పశువులను స్వాధీనం చేసుకోవడం, ఇతర చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని గ్రామపంచాయతీ పాలకవర్గం హెచ్చరించింది. ఈ తీర్మానాన్ని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని రాజంపేట గ్రామపంచాయతీ పాలకవర్గం స్పష్టం చేసింది.

భారీ వర్షాలకు కొట్టుకుపోయిన బ్రిడ్జిలు.. స్తంభించిన రాకపోకలు

లింగాపూర్, జూలై 31, ప్రభాతవార్త :



ఇటీవల కురిసిన భారీ వర్షాల ధాటికి లింగాపూర్ మండల పరిధిలోని ఖీమానాయక్ తండా ఫూల్సింగ్ నాయక్ తండా వద్ద ఉన్న బ్రిడ్జిలు నీటి ఉధృతికి కొట్టుకుపోయాయి. దీంతో ఈ రెండు గ్రామ పంచాయతీల పరిధిలోని పలు తండాలు, గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి, రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.బ్రిడ్జిలు కొట్టుకుపోవడంతో అత్యవసర వైద్య సేవలకు, నిత్యవసర సరుకుల కొనుగోలుకు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత శాఖల అధికారులు. నాయకులు తక్షణమే స్పందించి తాత్కాలికంగా రాకపోకలు పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలి. అలాగే వెంటనే నూతన బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, ప్రజల రవాణా కష్టాలను తీర్చాలని గ్రామస్తులు కోరుకున్నారు, ఈ కార్యక్రమంలో కుమ్ర రామచందర్, తొడసం భగవంతరావ్, ఆత్రం యెజు,కోవ లచ్చు జాదవ్ బాబూలాల్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పరిశీలన

- ఇంటింటి సర్వేపై ఆరా తీసిన రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్, ఎమ్మెల్సీ దండే విఠల్

కాగజ్‌నగర్ రూరల్,జూలై 31, ప్రభాతవార్త :

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ ప్రాంతంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా ఓటరు నమోదు, వివరాల్లో మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియను పరిశీలించి బూత్ స్థాయి అధికారులు నిర్వహిస్తున్న పనితీరుపై ఆరా తీశారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ప్రజలు తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని అవసరమైన మార్పులు, చేర్పులు ఉంటే సకాలంలో చేయించుకోవాలని కోరారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి, స్థానిక కౌన్సిలర్ కచ్చకాయల జ్యోతి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మాధురి, కిరణ్‌తో పాటు బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లు, పర్యవేక్షకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ ఉచిత కోచింగ్ తరగతులుమోహన్ రావు పాటిల్

- ప్రజా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ
- ఈ నెల 3న ప్రారంభం
- బీజేపీ సీనియర్ నాయకులు మోహన్ రావు పాటిల్ భోస్లే

భైంసా, జులై 31, ప్రభాతవార్త:

మోహన్ రావు పాటిల్ ప్రజా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు పోటీపడుతున్న అభ్యర్థుల కోసం ఉచిత కోచింగ్ తరగతులు ఏర్పాటు చేసినట్లు బీజేపీ సీనియర్ నాయకులు, ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పాటిల్ భోస్లే తెలిపారు. ఈ శిక్షణ తరగతులు ఆగస్టు 3వ తేదీన ఉదయం 11.00 గంటలకు భైంసాలోని మోహన్ రావు పాటిల్ స్టడీ సర్కిల్ (జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీ)లో ప్రారంభమవుతాయని వెల్లడించారు. ముధోల్ నియోజకవర్గ యువతతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నిరుద్యోగ అభ్యర్థులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటేలా అభ్యర్థులకు నిపుణులచే శిక్షణ ఇప్పించనున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి శిక్షణలో కాగజ్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

- మున్సిపల్ పాలన, ప్రజా సమస్యల పరిష్కారంపై అవగాహన

కాగజ్‌నగర్ రూరల్,జూలై 31, ప్రభాతవార్త :

హైదరాబాద్ గచ్చిబౌలిలో రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల కౌన్సిలర్లకు నిర్వహించిన రాష్ట్రస్థాయి సీడీఎంఏ శిక్షణ కార్యక్రమంలో కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్ డా. కొత్తపల్లి అనితతో పాటు ముగ్గురు కౌన్సిలర్లు పాల్గొన్నారు. 28వ వార్డు కౌన్సిలర్ ఈర్ల విశ్వేశ్వరరావు, 8వ వార్డు కౌన్సిలర్ గజ్జల లావణ్య లక్ష్మణ్, 7వ వార్డు కౌన్సిలర్ కమల శిక్షణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ పాలన, కౌన్సిలర్ల బాధ్యతలు, అభివృద్ధి పనుల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం, పారదర్శక పరిపాలన తదితర అంశాలపై అధికారులు శిక్షణ ఇచ్చారు. స్థానిక సంస్థల పాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయడంపై కౌన్సిలర్లకు అవగాహన కల్పించారు.

తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి అమృతం వంటివి

- ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్
- ఆగస్టు I నుండి 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

నస్పూర్, జూలై 31, ప్రభాతవార్త

తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి అమృతం వంటివని, బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపే తల్లిపాలు పట్టించడం ఎంతో శ్రేయస్కరమని మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ నరేందర్ రాథోడ్ స్పష్టం చేశారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని ఆగస్టు 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న అవగాహన కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లను శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు, మాతా శిశు సంరక్షణ కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తమ పరిధిలోని గ్రామాల్లో పర్యటిస్తూ తల్లులకు, వారి కుటుంబ సభ్యులకు తల్లిపాల విశిష్టతను వివరించాలన్నారు. తల్లిపాల వల్ల బిడ్డల్లో వ్యాధి నిరోధక శక్తి పెరిగి నిమోనియా, నీళ్ల విరోచనాలు, అలర్జీలు, మధుమేహం వంటి వ్యాధుల నుండి రక్షణ లభిస్తుందని తెలిపారు. జ్ఞాపకశక్తి, చురుకుదనం, కంటిచూపు మెరుగుపడటంతో పాటు తల్లిబిడ్డల మధ్య అనుబంధం బలపడుతుందని వివరించారు. అలాగే బిడ్డకు పాలు ఇవ్వడం ద్వారా తల్లులలో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు రాకుండా నివారించవచ్చని, ప్రసవానంతర రక్తస్రావం తగ్గి రక్తహీనత బారిన పడకుండా ఉంటారని పేర్కొన్నారు. విజయవంతంగా తల్లిపాలు అందించడానికి నిర్దేశించిన 10 సూత్రాలను గర్భిణులు, బాలింతలకు అర్థమయ్యేలా వివరించాలని ఆరోగ్య సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులు విశ్వేశ్వర్ రెడ్డి, డిపిఓ ప్రశాంతి, వసుమతి, సుమన్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మందమర్రి జిఎం కార్యాలయంలో ఏఐటీయూసీతో 20వ స్ట్రక్చర్ మీటింగ్

- కార్మిక సమస్యలపై సమగ్ర చర్చ

మందమర్రి, జూలై 31, ప్రభాతవార్త

సింగరేణి కార్మికుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం లక్ష్యంగా మందమర్రి ఏరియాలో గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీతో 20వ స్ట్రక్చర్ మీటింగ్ శుక్రవారం సౌహార్ద వాతావరణంలో జరిగింది. ఈ సమావేశానికి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ అధ్యక్షత వహించగా, జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు కార్మికులకు సంబంధించిన పలు సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చారు. మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, రామకృష్ణపూర్ బ్రాంచ్ సెక్రటరీ అక్బర్ అలీ, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీఎం ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ సింగరేణి అభివృద్ధిలో కార్మిక సంఘాల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. సంస్థ కేవలం ఉత్పత్తి లక్ష్యాలకే పరిమితం కాకుండా కార్మికుల సంక్షేమానికి కూడా అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. గత సమావేశంలో చర్చించిన అంశాల పురోగతిని ఈ సందర్భంగా సమీక్షించారు. యూనియన్ ప్రతినిధులు పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ఆపరేటర్లకు అవసరమైన పనిముట్లు, రెయిన్ కోట్లు అందించడం, పెండింగ్‌లో ఉన్న టెండర్ సూపర్‌వైజర్ ప్రమోషన్ పరీక్ష నిర్వహించడం, వర్క్‌షాప్‌లో మౌలిక సదుపాయాల మెరుగుదల వంటి ఈ సమావేశంలో ఎస్ఓటు జీఎం జి.ఎల్. ప్రసాద్, ఏరియా ఈ అండ్ ఎం బాలాజీ భగవతి ఝు, కేకే గ్రూప్ ఏజెంట్ ఖాదిర్, ఎస్కే గ్రూప్ ఏజెంట్ సంతోష్ కుమార్, డీజీఎం (పర్సనల్) అశోక్, డీజీఎం (ఐఈడీ) కిరణ్ కుమార్, డీజీఎం (సివిల్) షేక్ మదీనా భాష, ఏరియా స్టోర్స్ డీజీఎం రవీందర్, వర్క్‌షాప్ డిపైఎస్సీ నరేష్, ఎస్ఎస్ఓ వెంకటేశ్వర రెడ్డి, ఫారెస్ట్ అధికారి నవీన్, సీనియర్ పీవో కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. యూనియన్ తరఫున సుదర్శన్, సీవీ రమణ, రాజేశం తదితరులు హాజరయ్యారు.

పోరాటానికి ప్రతిఫలం... తలసేమియా బాధితులకు పెన్షన్లు

ఆగస్టు పదిహేనునుంచి అమలు... ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేసిన కాసర్ల శ్రీనివాస్

మంచిర్యాల,జులై 31, ప్రభాతవార్త

తలసేమియా బాధితులకు ఆగస్టు పదిహేనవ తేదీ నుంచి పెన్షన్లు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం సుదీర్ఘ పోరాటానికి దక్కిన విజయమని తలసేమియా సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. తలసేమియా బాధితుల సంక్షేమం కోసం ఎన్నో సంవత్సరాలుగా ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్లడం, వినతిపత్రాలు సమర్పించడం, ప్రజాప్రతినిధులు, అధికారులతో నిరంతరం చర్చలు జరపడం వంటి ప్రయత్నాల ఫలితంగానే ఈ నిర్ణయం వెలువడిందన్నారు. మంచిర్యాల కేంద్రంగా ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలకు చెందిన తలసేమియా బాధితులు ఐక్యంగా చేసిన కృషి ఈ విజయానికి బలమైందన్నారు. స్థానిక ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, జిల్లా యంత్రాంగం అందించిన సహకారం మరువలేనిదని చెప్పారు. పెన్షన్ల అమలుతో తలసేమియా బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించడంతో పాటు వారి జీవనోపాధికి కొంత ఊరటనిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా తలసేమియా బాధితుల సమస్యలపై సానుకూల నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సంబంధిత మంత్రులు, ఉన్నతాధికారులు, సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులకు కాసర్ల శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

దుర్గామాత జాతరకు పటిష్ట పోలీసు బందోబస్తు

- క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించిన ఏసీపీ ప్రకాష్, సీఐ ప్రమోదరావు

మంచిర్యాల,జులై 31, ప్రభాతవార్త

మంచిర్యాల పట్టణంలోని ఏసీసీ క్వారీలో ఆగస్టు 2వ తేదీన జరగనున్న దుర్గామాత జాతర మహోత్సవాన్ని ప్రశాంతంగా, భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించేందుకు పోలీసులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. జాతరకు వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో పట్టణ ఏసీపీ ప్రకాష్, పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ రావు శనివారం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు ఆలయ కమిటీకి స్పష్టం చేశారు. భక్తుల రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక కార్యాచరణ అమలు చేయనున్నట్లు తెలిపారు. జాతరకు వెళ్లే ప్రధాన మార్గంలో ఉన్న రాళ్లవాగు వంతెనను అధికారులు పరిశీలించి, అక్కడ అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. జాతరకు హాజరయ్యే భక్తులు కార్మెల్ పాఠశాల నుంచి, గ్రీన్ సిటీ జంక్షన్ మీదుగా అండాలమ్మ కాలనీ మార్గాన్ని వినియోగించాలని పోలీసులు సూచించారు. ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించడం ద్వారా ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు భక్తులు సురక్షితంగా ఆలయానికి చేరుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.జాతర విజయవంతానికి భక్తులు పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో కాంగ్రెస్ బిఎల్ఓలు మరింత బాధ్యతతో వ్యవహరించాలి

ఆసిఫాబాద్ టౌన్, జులై 31, ప్రభాతవార్త

ఎస్ఐఆర్ ప్రక్రియలో కాంగ్రెస్ బిఎల్ఏలు మరింత బాధ్యతతో వ్యవహరించాలని ఆదిలాబాద్ పార్లమెంట్ ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ ఆరెపల్లి మోహన్ సూచించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థాన పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ దాదాపు 100 శాతం పూర్తయినా సందర్భంగా శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశములో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్ అహ్మద్, డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, ఎమ్మెల్సీ దండే విట్టల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్, మాజీ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు తో కలిసి పాల్గొని మాట్లాడారు. చిరునామా మారిన వారు, గుర్తించలేని ఓటర్ల వివరాలను పరిశీలించి అర్హుల ఓటు హక్కు సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సర్ ప్రక్రియ పూర్తయినప్పటికీ బాధ్యత ముగియలేదని, ఇకపై జిషిష్టెడ్‌చ ఓట్ల వివరాలను పరిశీలించి అర్హులైన ప్రతి ఓటరు హక్కు పరిరక్షణ కోసం మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ గతంలోనూ ఎస్ఐఆర్ ప్రక్రియలు జరిగినప్పటికీ, ఈసారి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఖరి కారణంగానే కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారించిందని విమర్శించారు. ఎస్ఐఆర్ పేరుతో బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని, గతంలో నాలుగు రాష్ట్రాల్లో చోటుచేసుకున్న పరిణామాలే ఇందుకు నిదర్శనమని ఆరోపించారు. అందుకే తెలంగాణలో ప్రతి అర్హుడి ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ఈ ప్రక్రియను ప్రతిష్మాత్మకంగా చేపట్టిందని తెలిపారు. డిసిసి అధ్యక్షురాలు మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన ఒక్క పౌరుడైనా ఓటు హక్కు కోల్పోకూడదన్నదే ఏఐసిసి, పిసిసి లక్ష్యమని తెలిపారు. ఆ సంకల్పంతోనే రాష్ట్ర నాయకులను జిల్లాలకు పంపించి ఎస్ఐఆర్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ఇంకా ఎవరికైనా ఓటరు జాబితాకు సంబంధించి సమస్యలు ఉంటే వెంటనే కాంగ్రెస్ నాయకులను గాని బిఎల్ఏలను సంప్రదించాలని సూచించారు. ఈ విజయానికి కృషి చేసిన బి.ఎల్.ఏలు, పోలింగ్ బూత్ అబ్జర్వర్లు, నియోజకవర్గ కోఆర్డినేటర్లు, నాయకులు, కార్యకర్తలను అభినందించారు. ఈ సమావేశంలో ఆసిఫాబాద్,జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ లు ఇరుకుల మంగ, కూడ్మేత విశ్వనాథ్,డీసీసీ ఉపాధ్యక్షులు భీమ్ రావ్,డీసీసీ ప్రధాన కార్యదర్శిలు గాదెవేణి మల్లేష్, విజయ్,శోభన్, ఆసిఫాబాద్ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా భాయ్,కాంగ్రెస్ ఆసిఫాబాద్ పట్టణ అధ్యక్షులు ఇమ్రాన్, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రవేశాల పోస్టర్ల ఆవిష్కరణ

- ఆగస్టు 7లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

కాగజ్‌నగర్ రూరల్,జూలై 31, ప్రభాతవార్త :

డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. విశ్వవిద్యాలయ విద్యార్థి సేవల డైరెక్టర్ ప్రొఫెసర్ వై. వెంకటేశ్వర్లు, శ్రీ రామానంద తీర్థ సొసైటీ ఫర్ గ్రామీణ నైపుణ్య శిక్షణ సంస్థ చైర్మన్ ఎన్. కిషోర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి, అధ్యయన కేంద్రం సమన్వయకర్త తూడూరు దత్తాత్రేయ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి మాట్లాడుతూ.. ఓపెన్ డిగ్రీలో ప్రవేశం పొందాలనుకునే ఇంటర్మీడియట్, డిప్లొమా, రెండేళ్ల ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆగస్టు 7లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఉద్యోగం చేస్తూనే ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారికి ఓపెన్ యూనివర్సిటీ కోర్సులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ప్రొఫెసర్ వై. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు శ్రీ రామానంద తీర్థ సొసైటీ ఫర్ గ్రామీణ నైపుణ్య శిక్షణ సంస్థ ద్వారా వివిధ కోర్సుల్లో ఉచిత నైపుణ్య శిక్షణ అందించడంతో పాటు, శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యయన కేంద్రం సమన్వయకర్త దుర్గం జనార్దన్, అధ్యాపకులు డా. దేవేందర్‌రెడ్డి, డా. తేమాజీ, సంతోష్, బోధనేతర సిబ్బంది సత్యనారాయణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై చైతన్యం పెంపొందించుకోవాలి: తహసీల్దార్ ఎన్. సాయికృష్ణ

- రాజారంలో ఘనంగా సివిల్ రైట్స్ డే నిర్వహణ

వేమనపల్లి, జులై 31, ప్రభాతవార్త

రాజారం గ్రామంలోని ఎస్టీవాడలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే)ను ఘనంగా నిర్వహించారు. మండల తహసీల్దార్ ఎన్. సాయికృష్ణ, గ్రామ సర్పంచ్ ఎనుగంటి మల్లేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, రక్షణ చట్టాలు, సంక్షేమ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎన్. సాయికృష్ణ మాట్లాడుతూ, విద్య ద్వారానే వ్యక్తిగత, సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించి ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. ఎస్సై జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి పౌరుడు తన హక్కులతో పాటు విధులపైనా అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రాజ్యాంగం కల్పించిన రక్షణలను సద్వినియోగం చేసుకోవాలని, ఎలాంటి వివక్ష, వేధింపులు ఎదురైనా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం మరింత బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఖాలిఖ్, జీపీఓ తిరుపతి, పంచాయతీ కార్యదర్శి స్నిగ్ధ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ పూర్తి చేయడంలో వేగం పెంచాలి

- కాగజ్‌నగర్ తహసీల్దార్ మధుకర్

- రేషన్ డీలర్లతో సమీక్ష.. ఆగస్టు 30లోగా వందశాతం పూర్తి చేయాలని ఆదేశం

కాగజ్‌నగర్ రూరల్,జూలై 31, ప్రభాతవార్త :

కాగజ్‌నగర్ మండలంలోని చౌకధరల దుకాణ డీలర్లతో ఈ-కేవైసీ ప్రక్రియపై శుక్రవారం అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని 57 మంది రేషన్ డీలర్లు సమావేశానికి హాజరయ్యారు. ఆహార భద్రత కార్డుల లబ్ధిదారుల ఈకేవైసీని వందశాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డీలర్లకు సూచించారు.అర్హత కలిగిన ఏ ఒక్క లబ్ధిదారుడు కూడా ఈకేవైసీకి దూరం కాకుండా చూడాలని, ఈ ప్రక్రియ ప్రాధాన్యత, ప్రయోజనాలను లబ్ధిదారులకు వివరించి ఆగస్టు 30లోగా వందశాతం పూర్తి చేసేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే చౌకధరల దుకాణాల పరిధిలో మరణించిన వారు, వివాహం అనంతరం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలను గుర్తించి అధికారులకు సమర్పించాలని సూచించారు.కాగజ్‌నగర్ మండలంలో 57 చౌకధరల దుకాణాల పరిధిలో 33,386 ఆహార భద్రత కార్డులు, 1,11,371 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇప్పటి వరకు 18,857 కార్డులకు సంబంధించి 57,655 మంది లబ్ధిదారుల ఈకేవైసీ పూర్తికాగా, 12,570 కార్డులకు సంబంధించి 31,646 మంది లబ్ధిదారుల ఈకేవైసీ పాక్షికంగా పూర్తయింది.మిగిలిన లబ్ధిదారుల ఈకేవైసీని వేగవంతం చేసి నిర్ణీత గడువులో వందశాతం పూర్తి చేయాలని డీలర్లకు సూచించారు. లబ్ధిదారుల వివరాలను నిరంతరం పరిశీలిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ సౌకర్యం అందేలా చూడాలని, అనర్హులైన వారి వివరాలను సకాలంలో అధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రేషన్ డీలర్లు,తదితరులు పాల్గొన్నారు.

కడెం ప్రాజెక్టు పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అధికారులు నిరంతరం పరిస్థితిని పర్యవేక్షించాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్, జులై 31, ప్రభాతవార్త:

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కడెం ప్రాజెక్టు పరిసర ప్రాంతాల ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. కడెం ప్రాజెక్టును శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం, ప్రస్తుత నీటి నిల్వ, ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలను నీటిపారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దిగువ ప్రాంతాల ప్రజలకు నీటి విడుదలకు సంబంధించిన సమాచారాన్ని ముందుగానే అందించి అప్రమత్తం చేయాలన్నారు. ప్రాజెక్టు వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అనంతరం ఖానాపూర్ పట్టణంలోని హైటెక్ సిటీ మైనారిటీ వసతి గృహానికి వెళ్లే మార్గంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారిని కలెక్టర్ పరిశీలించారు. వసతి గృహ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నిత్యావసర సరుకులను అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఖానాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ అంకం మోనిక, నీటిపారుదల శాఖ అధికారులు జగదీష్, రాజేంద్ర ప్రసాద్, ప్రవీణ్ కుమార్, వీరన్న, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, తహశీల్దార్లు ఖాజా మొయినుద్దీన్, సుజాత, ఎంపీడీఓ రాధా రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

కడెం ప్రాజెక్టును ఆకస్మికంగా సందర్శించి ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో పరిస్థితులను పరిశీలిస్తున్న నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఇతర అధికారులు

బురద,ఇసుక మేటలను తొలగిస్తున్న ఎంపీడీఓ,సర్పంచ్

వంతెనపై బురద, ఇసుక మేటలు తొలగింపు

బెజ్జూర్, జూలై 31, ప్రభాతవార్త:

బెజ్జూర్ మండలంలోని కృష్ణపల్లి,సుస్మిర్ ఒర్రెలపై గల లో లెవెల్ వంతెనపై పేరుకుపోయిన బురద,ఇసుక మేటలను శుక్రవారం ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్,స్థానిక సర్పంచ్ వడ్డేపల్లి లావణ్య శ్రీనివాస్ సంయుక్తంగా తొలగించారు.గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు రెండు ఒర్రెలు నిండుగా ప్రవహించడంతో వంతెనలపై బురద,ఇసుక మేటలు పేరుకుపోయాయి.వరద ఉధృతి తగ్గిన తర్వాత ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.ఇట్టి విషయం తెలుసుకుని ఎంపీడీఓ,సర్పంచ్ వారి ఇబ్బందులను తొలగించారు.

మాట్లాడుతున్న తహసిల్దార్ జ్యోత్స్న

రేపల్లెవాడలో సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సు

తాండూర్, జూలై 31, ప్రభాతవార్త :

తాండూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ రేపల్లెవాడ గ్రామంలో శుక్రవారం సర్పంచ్ ఆకుల వెంకటేష్ అధ్యక్షతన సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సును నిర్వహించారు. తహసిల్దార్ జ్యోత్స్న మాట్లాడుతూ రైతుల భూమూల సమస్యల పరిష్కారానికి సమగ్ర భూ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏడి శ్రీనివాస్, గిర్దావర్ మురళీధర్, సర్వేయర్ రామకృష్ణ, పంచాయతి సెక్రటరీ లక్ష్మణ్, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, వార్డు మెంబర్లు, ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

నెన్నెల మండల సర్పంచ్, ఉప సర్పంచ్ ఫోరం నేతలకు ఎమ్మెల్యే వినోద్ సన్మానం

బెల్లంపల్లి, జూలై 31, ప్రభాతవార్త

నెన్నెల మండల సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ ఫోరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షులను బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఘనంగా సన్మానించారు. శుక్రవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇటీవల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఫోరం ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు జాడి రాజ్ కుమార్, ఉప సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు బైరీ సాయి గౌడ్ లను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి మాట్లాడుతూ నెన్నెల మండలంలోని సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు గ్రామాల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామ స్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరుతూ, ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాభివృద్ధిలో ఫోరం కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు బొమ్మెన హరీష్ గౌడ్, జిల్లా డీసీసీ కార్యదర్శి సుంకరి శ్రీనివాస్, గురునాథం మల్లా గౌడ్, తిరుపతి రెడ్డి, లావుడ్య రమేశ్, ఉయ్యాల మల్లిక తదితరులు పాల్గొన్నారు.

డిజిటలైజేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి అయ్యేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి

- జిల్లా కలెక్టర్ కె.హరిత

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూలై 31, ప్రభాతవార్త :

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ త్వరగా పూర్తి అయ్యే విధంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ 100 శాతం పూర్తి చేయడంలో రాజకీయ పార్టీలు తమ సహకారం అందించాలని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 90 శాతం డిజిటలైజ్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని, గ్రామీణ ప్రాంతాలలో ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందని, పట్టణ ప్రాంతాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి పూరించిన ఎన్యుమరేషన్ ఫారాలను బూత్ స్థాయి అధికారులకు అందే విధంగా చొరవ తీసుకోవాలని తెలిపారు. భారత ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ గడువును ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని, కానీ ప్రక్రియ ముందే పూర్తి చేసే విధంగా రాజకీయ పార్టీలు కృషి చేయాలని తెలిపారు. ఎ.ఎస్.డి. ఓటర్ల జాబితా, రేషనలైజేషన్ ప్రక్రియ వెంటనే చేపట్టడం జరుగుతుందని, మ్యాపింగ్ కాని వారిని గుర్తించాలని తెలిపారు. రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు బూత్ స్థాయి అధికారులకు సహకరించి ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి అయ్యేలా కృషి చేయాలని తెలిపారు.అనంతరం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు కలెక్టర్ ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, జూలై 31, ప్రభాతవార్త

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 9న జిల్లా వ్యాప్తంగా ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, హక్కులు, అభివృద్ధిపై అవగాహన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్యనిర్వహణ కమిటీ ప్రతినిధులతో కలిసి ఛలో మంచిర్యాల కార్యక్రమ సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివాసీ సమాజ అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆదివాసీలకు విద్య, వైద్యం, ఉపాధి, గృహ వసతి, త్రాగునీరు, రహదారులు తదితర మౌలిక సదుపాయాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సాధించడం జరుగుతుందని తెలిపారు. ఆగస్టు 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవం-ఛలో మంచిర్యాల ర్యాలీ, సభ కార్యక్రమాలను విజయవంతం చేయాలని, ఆదివాసీ కళలు, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్య నిర్వహణ కమిటీ ప్రతినిధులు తట్ట అర్జున్, నైతం లక్ష్మణ్, సోయం జంగు, కుడిమేత తిరుపతి, గంజి రాజన్న, ఆడ జంగు, పెంద్రం హనుమంతు, కొడప అనిల్, కుర్సెంగ వెంకటేష్, పల్లె పృథ్వీరాజ్, మడావి వెంకటేష్, పెంద్రం తిరుపతి, గావుడె శ్రావణ్, మేసినేని అరుణ్, గెడం ప్రవీణ్ పాల్గొన్నారు.

రహదారులపై క్రేజీ వీల్స్ నడపరాదు

- తాండూర్ ఎస్సై ప్రసాదరావు

తాండూర్, జూలై 31, ప్రభాతవార్త :

ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో జాతీయ, ఆర్ అండ్ బి రహదరులపై నిబంధనలకు విరుద్ధంగా కేజీ వీల్స్ (ఇనుప చక్రాలు) నడపరాదని తాండూర్ ఎస్సై ప్రసాదరావు తెలిపారు. రహదారులను దెబ్బతీసే విధంగా కేజీ వీల్స్ తో ట్రాక్టర్లను నడిపితే సంబంధిత డ్రైవర్‌తో పాటు ట్రాక్టర్ యజమానిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరు తప్పకుండా నిబంధనలు పాటించాలని, చట్టాన్ని ఉల్లంఘించే పనులు ఎవరైనా చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సర్-2026లో అన్‌కలెక్టబుల్ కేసులపై పరిశీలన

- బీఎల్ఓల సమక్షంలో కారణాలపై ఆరా

కాగజ్‌నగర్ రూరల్,జూలై 31, ప్రభాతవార్త :

సర్-2026 కార్యక్రమంలో భాగంగా అన్‌కలెక్టబుల్ కేసుల కారణాలను సంబంధిత బీఎల్ఓల సమక్షంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కేసులకు సంబంధించిన వివరాలను బీఎల్ఓలను అడిగి తెలుసుకుని, వాస్తవ పరిస్థితులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, 25వ వార్డు కౌన్సిలర్ దుర్గం సూరజ్ పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. సర్-2026 ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడంతో పాటు అర్హులైన ఓటర్ల వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.